


# మాలతి మనసు నవ్వింది

— వి. ప్రతిమ

"మాలతీ! మగాడ్ని అదుపులో పెట్టి మన కొంగుక్కట్టేసుకో గలగడం నిజంగా ఓ టెక్నిక్. అది అందరికీ చేతకాదు...అసలు మగాడు ఎక్కువగా బయట తిరుగుతున్నాడంటే దానిక్కారణం తప్పకుండా ఆడదే. ఆయన్ని యింట్లో కట్టిపడేసుకోగల చాకచక్యం నీకు బొత్తిగా లేదు" తప్పంతా మాలతిదే అయినట్లుగా చెప్పింది సునంద.

"మా ఆయన పూర్తిగా నా అదుపులోనే వుంటాడు సుమా" అనే గర్వమూ, లోలోతుగా మాలతి మీద సానుభూతి కన్పించాయామె మాటల్లో.

మాలతి చిన్నబుచ్చుకున్నట్లుగా తల వంచుకుంది... ఉబికి రాబోతున్న కళ్ళనీళ్ళని ఆత్మాభిమానంతో పట్టి ఆపేసిందామె వళ్ళుబిగువున.

"నువ్విలాగే వున్నావంటే యింకా యింకా నీక్కాకుండా పోతాడాయన. ఈ రోజు పేకాటంటాడు. రేపు తాగు డంటాడు...ఎల్లుండేమో అమ్మాయిలంటాడు" మాలతి మౌనంగా వుండడం చూసి మరింత రెట్టించి నట్లుగా చెప్పింది సునంద... "నిన్నటికి మొన్నా రాత్రంతా యింటికే రాలేదట కదా...ఇక ఆ రాత్రి నువ్వు అన్నమూ తినివుండవూ, నిద్రా పోయి వుండవు. ఎందుకిలా... అసలు నీవయసెంతనీ?... మీ అత్త మామలైనా మందలించవద్దూ కొడుకుని" ఈసడించుకున్నట్లుగా అంది "తొమ్మిది కాకముందే యింత వయసొచ్చినా వాళ్ళిద్దరూ గదిలో దూరి తలుపేసేసుకుంటున్నారు కదా మరి కోడలి మాటేమిటి? కొంచెం అయినా పట్టించుకోవద్దూ... జ్ఞానం లేకపోతే సరి" సునంద వాగ్ధోరణి నిరాటంకంగా సాగిపోతోంది.

దెబ్బతిన్నట్లుగా సునంద వైపు చూసింది మాలతి.

"వాళ్ళు మాత్రం ఏం చేస్తారు సునందా? అద్దాలనాటి బిడ్డడు కాదు కదా." అప్పటికీ మామయ్యగారు రెండుమూడు సార్లు చెప్పబోతే,

"నాకు తెలుసు నేనెలా ప్రవర్తించాలో... నన్ను అదుపులో పెట్టాలని చూడకండి" అంటూ విదిలించే సారీయన. యిక అప్పట్నుండీ మామయ్య గారు కానీ అత్తయ్యగారు కానీ ఏమీ చెప్పాలని చూడరు" దిగులుగా చెప్పింది మాలతి.

సునంద మాలతికి వదిన తరఫున చుట్టం... ఈ ఊళ్ళోనే వుంటోంది కదాని వదిన ఆదేశించింది, అప్పుడప్పుడూ వెళ్ళి మాలతిని చూడమనీ, కంపెనీ యివ్వమనీ.

భార్యా భర్తలిరువురూ తరచుగా వస్తూండటంతో రెండు కుటుంబాల నడుమా చనువు పెరిగింది... అందునా సునందా, మాలతీ మరింత దగ్గరయ్యారు. ఆ చనువుతోనే సునంద మాలతిని మందలిస్తోంది భర్తని అదుపులో వుంచుకోమని.

ఆ రాత్రి చాలా సేపటి దాకా నిద్ర పట్టలేదు మాలతికి.

మగాడు ఎక్కువగా బయట తిరుగుతున్నాడంటే అది ఆడదాని తప్పా? ప్రతివాళ్ళూ యిలా అంటారేమిటి? అప్పుడెప్పుడో అమ్మ కూడా యిలానే అన్నది.

ఇందులో తన తప్పేంవుంది? తనేం చేసిందని? పోనీ అతగాడికి తనేం చేయలేదని?

మాలతి అందంగా వుంటుంది.

మాలతి హంసలా నడవగలదు

మాలతి మృదువుగా మాట్లాడగలదు

మాలతి గొప్పగా ప్రేమించనూ గలదు.

అసలా అమ్మాయిని చూసిన వాళ్ళెవరైనా సరే యిట్టే ఆకర్షింప బడుతారు. యిట్టే అభిమానిస్తారు. యిట్టే ప్రేమిస్తారు.

నిజానికి గోపీకి కూడా మాలతంటే యిష్టమే... ప్రేమిస్తాడు కూడా.

అయితే "ఇంటికి త్వరగా ఎందుకు రారు?" అన్న మాలతి నిత్య ప్రశ్నకు "వచ్చి ఏం చేయాలి మాలతీ? నా ముఖం నువ్వూ నీ ముఖం నేనూ చూసుకుంటూ కూర్చోడం తప్ప...ఏదో ఆఫీసులో రొటీన్‌గా పని చేసుకుంటూ వుంటాను కదా కాస్త రిలాక్సేషను కోసం క్లబ్బుకి వెళ్లాను. పేకాడుకోడానికే కదా వెళ్తున్నాను. మరెక్కడికీ వెళ్ళడం లేదు. సంతోషించు. ఏదో కొంపలు మునిగి పోయినట్లుగా ఆ ఏడుపు ముఖం ఏవిటి?" అంటాడతడు.

ఒక్కొక్కసారి యివే మాటలు మెల్లిగానూ చెప్తాడు. మరోసారి విసురుగానూ చెప్పి బాయిటికెళ్ళి పోతుంటాడు. అది అప్పటి అతడి మూడ్‌ని బట్టి వుంటుంది...మాలతికి ఏడుపొచ్చేస్తుంది.

"ఇంటికొచ్చి ఏం చేయాలి?" అంటే తనేం చెప్పగలదు?

పెళ్ళి అంటే మాలతికి ఓ నిర్దిష్టమైన అభిప్రాయ ముండేది.

భార్యా భర్తలిరువురూ ఒకరినొకరు అర్థం చేసుకుంటూ, ఓ అవగాహనతో సామరస్యంగా జీవించాలనీ, అతడి లోపాలను తనూ, తనలోపాలను అతడూ భరించి సరిదిద్దుకుంటూ అన్యోన్యంగా బ్రతకాలనీ ఎన్నో అనుకునేది. తన పుట్టింట్లో ఆమె తల్లిదండ్రుల నడుమా, అన్నా వదినెల నడుమా యిలాటి దాంపత్యాన్నే చూసింది...

అతడు సాయంత్రం త్వరగా వచ్చేస్తే యిద్దరూ కలిసి ట్యాంక్ బండ్‌మీదికెళ్ళి సరదాగా కబుర్లు చెప్పుకోవాలని వుంటుంది మాలతికి. కానీ అతడేనాడూ రాత్రి పన్నెండింటికంటే ముందు యింటికి రాడు.

తెల్లవారు ఝామునే నిద్రలేచి ఈ సర్వ ప్రపంచమంతా

చీకటికి వీడ్కోలు చెప్తూ, వెలుతురుకి స్వాగతం చెప్తోన్న ఆ సంధివేళ డాబామీద చలిలో అతడితో పాటు కూర్చుని వేడి వేడి కాఫీ త్రాగాలని వుంటుంది మాలతికి. కానీ అతడెన్నడూ తొమ్మిదింటికి తక్కువ నిద్ర లేవడు.

ఎప్పుడైనా అతడు మూడ్‌లో వుండగా చూసి ఈ విషయాలు చెపితే "బొత్తిగా నవలల్లోలా మాట్లాడకు మాలతీ... వాస్తవంలో జీవించడానికి ప్రయత్నించు" అంటాడు.

ఒక్కసారిగా రసాతలంలోనికి జారిపోయినట్లుగా అన్పించేస్తుంది. మాలతికి....... ఓసారి

"ఏవండీ సాయంత్రం వస్తూ వస్తూ మల్లెలు తీసుకురారు?" చెప్పింది మాలతి సిగ్గు సిగ్గుగా.

"మాలతీ ఆఫీసయిన తరువాత ఆ హడావిడిలో నాకు గుర్తుండక పోవచ్చు. ఇంటివద్ద అమ్ముతాయి కదా మల్లెలు. యిక్కడే కొనుక్కో బీరువాలో డబ్బులున్నాయి. నీకేం కావల్సి వచ్చినా తీసి ఖర్చు పెట్టుకో" చెప్పి రివ్వున దూసుకుపోయాడు స్కూటర్లో.

నీరసమొచ్చింది... మల్లెలు తను కొనుక్కోలేకనే అడిగిందా? అతడి చేత్తో తన కోసం మల్లెలు తీసుకొస్తే? అసలా భావనే యెంత మధురంగా వుంది?

"నేనెంత పనిలో వున్నా నువ్వు నా మనసులోనే వున్నావు సుమా" అని చెప్పక చెప్పినట్లవుతుంది.

ఇంత చిన్న విషయం అతడికెందు కర్థం కాదు?

అతడి ప్రాక్టికాలిటీకి, తన ఈస్థటిక్‌సెన్స్‌కీ బొత్తిగా పొత్తు కుదరక యిలాటి చిన్న చిన్న కోరికలన్నీ గగన కుసుమాలై పోయాయి మాలతి జీవితంలో. దాంతో క్రమంగా యిద్దరి మధ్యా పెద్ద అగాధం ఏర్పడిపోయింది.

మాలతి ఎంత పూడ్చాలని ప్రయత్నించినా రోజు రోజుకీ అది పెరుగుతోందే తప్ప ఏమాత్రం తగ్గే సూచనలు కన్పించటం లేదు.

• • •

సోఫాలో కూర్చుని గోపికి స్వెటరు అల్లుతోంది మాలతి.

మాలతి అద్భుతంగా ఎంబ్రాయిడరీ చేయగలదు. మిగిలిన అన్ని రకాల చేతిపనులు కూడా ఆమె చేతిలో చప్పున తలవంచుతాయి. ఎప్పుడూ ఏదో ఒకటి అల్లుతూనో, కుడుతూనో వుంటుంది.

అందులో కొత్త కొత్త ప్రయోగాలు చేస్తుంటుంది.

భర్త కోసం ఎదురుచూస్తూ గోళ్ళు గిల్లుకుంటూ కూర్చోదామె. మన సు ఆలోచిస్తూ వున్నా చేతులు మాత్రం పనిచేస్తూనే వుంటాయి. ఒక విధంగా ఈ ఆర్టిస్టిక్ హ్యాండనేదే లేకపోతే మాలతికి ఈపాటికే పిచ్చి పట్టేసి వుండేదేమో.

"అమ్మాః మాలతీ కాసిని మంచినీళ్ళు తెచ్చి పెడతావా?" ఆఫీసునుండి వచ్చి నీర్సంగా సోఫాలో కూలబడ్డారు రాఘవరావుగారు.

"అలాగే మామయ్య" అంటూ చప్పున వెళ్ళి మంచినీళ్ళు తెచ్చిపెట్టింది.

"మీ అత్తయ్యేదమ్మా?"

"వ్రాసుకుంటున్నట్లున్నారు మామయ్యా"

"మధ్యాహ్నం మాత్రలు మర్చిపోకుండా వేసుకుందా అమ్మా"

"వేసుకున్నారుః నేనే యిచ్చాను ..... కాఫీ కలపనా మీకు".

"వద్దులేమ్మా" అన్నారు

## రచయిత్రి స్వీయ పరిచయం

పుట్టింది చెన్నపట్నంలోనే అయినా, పెరిగింది ఆంధ్ర దేశంలో, కాలేజీ చదువు కృష్ణానదీ తీరాన సాగింది. శ్రీవారు డాక్టరు ... ఓ బాబు, ఓ పాప...

ఎప్పుడైనా మనసు స్పందించినపుడు, ఆ క్షణాన సమయం నన్ను పర్మిట్ చేస్తే ఆ స్పందనకో స్వరూపమిస్తాను... ఇప్పటి వరకూ చిన్నవీ, పెద్దవీ ఓ పాతిక కథలూ, ఓ అయిదారు కవితలూ, మరికొన్ని వ్యాసాలూ అచ్చును చూశాయి. మరో ఆరు కథలు వివిధ పత్రికల్లో అంగీకరించబడి వున్నాయి. ఇంతకు మించి సాహితీ పరంగా నన్ను గురించి చెప్పుకోడానికేమీ లేదు. తరచుగా నా కథలూ, కవితలూ ప్రచురిస్తూ



నన్ను ప్రోత్సహిస్తోన్న 'వనిత'కి మరోసారి కృతజ్ఞతలు.

వి.ప్రతిమ

"ఈపూటకి నేను తెస్తాను లెండి మామయ్యా... నేను బాగా కలపగలను" అంటూ నవ్వింది మాలతి. కోడలి నవ్వులోని అంతరార్థాన్ని గ్రహించి ఆయన కూడా నవ్వేశారు.

భార్యచేత్తో కాఫీ కలిపి తెస్తేనే తప్ప ఆయన తాగరు.

ఉదయం ఆఫీసుకు వెళ్ళేటప్పుడు ఆవిడ ఎదు ర్రావాలంటారు.

సాయంత్రం అయిదింటికే ఇంటికి వచ్చేస్తారు ఖచ్చితంగా... రాగానే ఆవిడ కన్పించకపోతే విలవిల్లాడి పోతారు.

ఒక్కపూట ఆవిడ మాత్ర వేసుకోవడం మర్చిపోతే ప్రపంచయుద్ధం వచ్చినంతగా గొడవ చేసేస్తారు.

మాలతికి అతడిని చూస్తూంటే ఎంతో ముచ్చటగా వుంటుంది.

ఎంతక్రమం తప్పకుండా నడుచుకుంటాడాయన .... స్త్రీని ఎంతగా గౌరవిస్తారు? ఇలాటి వ్యక్తి కడుపున తన భర్తలాటి వ్యక్తి ఎలా పుట్టాడో అర్థం కాదు మాలతికి.

"పండిత పుత్రాః శుంఠః" అంటే యిదే కాబోలు.. ఇలా అనుకుంటూ వుంటే అప్రయత్నంగా నవ్వొచ్చిం దామెకి.

"ఏమిటమ్మా? యింకా నవ్వుకుంటున్నావా? కాఫీ తెచ్చి పెట్టవూ?" అన్నాడాయన బ్రతిమాలుతోన్న ధోరణిలో .... చటుకున్న ఆలోచనలో నుండి బయటపడి వంటగదిలోనికి పరుగు తీసింది మాలతి.

• • •

"అక్కాః మనిద్దరం సినిమాకు వెళ్తున్నాం త్వరగా తయారయిపో టిక్కెట్లు తెచ్చేశాను .... మా సుప్రీం సినిమా" టిక్కెట్లు ముద్దాడుతూ అక్కవైపు గర్వంగా చూశాడు ప్రవీణ్.

"వద్దురా సెకండ్ షోలు నాకలవాటు లేదు. నేను రాను" చెప్పింది మాలతి.

"అలవాటేముంది? అన్నీ అందరికీ పుట్టుకతోనే అలవాటవుతాయా? నీక్కాస్త డైవర్షనుంటుంది రొటీన్ లైఫ్‌లో నుండి ... బయల్దేరు" నవ్వాడు.

"బావగారొస్తారేమో"

"ఏం పర్వాలేదు ... నువ్వు రోజంతా ఆయన కోసం ఎదురుచూడ్డం లేదూ. ఒక్క రోజుకి ఎదురు చూడగలడులే" విసురుగా చెప్పి

"అసలొస్తాడో రాడో తెలీదు" అంటూ గొణుక్కున్నాడు తనలో తనే.

"పోనీ వెళ్ళి రారాదుటమ్మా. అబ్బాయి వస్తే నేను వడ్డిస్తానుగా" ప్రవీణ్‌ని సమర్థిస్తూ చెప్పింది అత్తగారు.

"అదికాదత్తయ్య" నసిగింది.

"పర్వాలేదు. వెళ్ళమ్మా" మళ్ళీ చెప్పిందామె.

తప్పనిసరిగా బయల్దేరింది మాలతి.

హాలువద్దకి వీళ్ళు వెళ్ళేసరికి దాదాపుగా అంతా లోపలకి వెళ్ళిపోయారు. వెలుపల ఓ అయిదారుమంది అమ్మాయిలూ, ఓ అబ్బాయీ నిల్చునివున్నారు. వారంతా గుంపుగా గుమికూడి వారిలో వారే ఏదో తర్జన పడ్తున్నారు. మాలతీ వాళ్ళు గేట్లోనికి అడుగు పెట్టగానే ఆబ్బాయి వడి వడిగా అడుగులు వేసుకుంటూ దగ్గరకు వచ్చారు.

"ఎక్స్క్యూజ్ మీ"

"ఏవిటండీ" అడిగాడు ప్రవీణ్.

"టికెట్సున్నాయా"

"ఉన్నాయండీ. ముందే తీసుకున్నాం" గర్వంగా చెప్పాడు ప్రవీణ్.

"సర్ మేము ఆరుమంది మీ సినిమాకని వచ్చాము. సుప్రీం మా అభిమాన నాయకుడు. మాకు నాలుగు టిక్కెట్లే దొరికాయి. ఈరోజు తప్పితే మాకు మరో రెండు నెలల వరకూ కుదరదు...క్లాసులూ, పరీక్షలూ, ప్రాక్టికల్సూ, ప్లీజ్ మీరు దయతలిచారంటే మేము ఆరుగురమూ సినిమా చూసేస్తాం....టిక్కెట్టుకి మీరెంత అడిగినా యిచ్చుకుంటాము." ఆరోజు సినిమా చూడలేకపోతే ప్రపంచం అంతా ఆరాత్రికే భూకంపం వచ్చి మునిగి పోతుందన్నట్లుగా అర్థిం చాడతడు.

కోపంగా చూశాడు ప్రవీణ్.

"ప్రవీణ్ పోన్లేరా పాపం. ఆ అబ్బాయి అంతగా రిక్వెస్టు చేస్తున్నాడుకదా. ప్రక్క హాల్లో 'గుండమ్మ కథ' ఆడుతోంది. ఎన్నిసార్లు చూసినా తనివి తీరదు. నాకసలు నిజానికి ఈ పిక్చరుకన్నాకూడా అదే చూడాలని వుంది".

"ఏంటక్కా నువ్వూ" విసుక్కున్నాడు.

"ప్లీజ్ నామాట విను ఏదో ఆ అబ్బాయి రిక్వెస్టు చేస్తున్నాడుగా"

ప్రవీణ్ కూడా నిన్న మొన్నటిదాకా స్టూడెంటే... ఆలైఫ్‌లోవున్న ఎంజాయ్‌మెంటూ, థ్రిల్లూ అనుకున్నది జరగనపుడు అంతులేని నిరుత్సాహమూ, అన్నీ తెల్సిన వాడే కనుక అక్కమాటకి బదులు చెప్పకుండా టిక్కెట్లిచ్చేశాడు.

"థాంక్యూ..థాంక్యూ వెరీమచ్ సార్" చేతులు పట్టి వూపేశాడు కుర్రాడు ఘనవిజయాన్ని సాధించినంత ఆనందంతో.

నవ్వుతూ చేతులు విడిపించుకుని

"మనీ యిస్తే వెళ్ళిపోతాం. మరో హాలుకి వెళ్ళాలి" చెప్పాడు ప్రవీణ్.

"ఓహ్ అయామ్ సారీ" అంటూ టిక్కెట్టు డబ్బులిచ్చాడు అబ్బాయి.

"మంచి బేరమే...నువ్వు బాగానే జతవడ్డావ్" అక్కమీద గొణుక్కుంటూ గేటువైపు అడుగులు వేశాడు ప్రవీణ్.

ఇద్దరూ మరికొన్త దూరంలోవున్న మరో థియేటర్‌లోనికి వెళ్ళి కూర్చున్నారు.

సినిమా యింకా మొదలు పెట్ట లేదు.

వెళ్ళి వెనుక రోలో ఒకమూలగా కూర్చున్నారిద్దరూ.

కొన్త సమయం దొరకడంతో తమ్ముడితో కబుర్లు మొదలు పెట్టింది. "ప్రవీణ్, శాంతి ఉత్తరం రాసిందిరా అమ్మాయిని చేసుకోవటానికి ఏవిటి నీకు అభ్యంతరం?" సూటిగానే ప్రశ్నించింది.

"నీకూ వ్రాసిందీ...హాతోస్మి" అన్నాడు ప్రవీణ్-తనే మళ్ళీ

"అక్కా తనతో ఏదో తెలిసీ తెలీని వయసులో స్కూలు రోజుల్లో ప్రేమించుకున్నాం-కాదు కాదు ప్రేమించుకున్నామని అనుకున్నాము...అది కౌమారవు ప్రేమ. ఇప్పుడు మనకు మెచ్యూరిటీ వచ్చింది. మనకులాలూ, మతాలూ వేరు. మనం పూర్తిగా విరుద్ధమైన సాంప్రదాయాల్లో పెరిగిన వాళ్ళం. మన పెళ్ళి ప్రాక్టికల్ కాదు. అనవసరంగా దగ్గరై జీవితమంతా బాధపడ్డం కన్నా విడిపోవడమే మంచిదని ఎంతచెప్పినా వినదే" తాను శాంతిని చేసుకోక పోవడం పెద్దనేరమేమీ కాదని అన్నట్లుగా గడగడా చెప్పేశాడు ప్రవీణ్.

"నువ్వు ప్రేమించే ముందు అమ్మాయిది మనకులం కాదని తెలీదా?"

"చెప్పానుగా అక్కా అది అడోలసెంట్ ప్రేమని" కొట్టిపారేశాడు.

గేటువైపు చూస్తోన్న మాలతి కళ్ళు ఆశ్చర్యంతో పెద్దవయ్యాయి.

సునంద భర్త సురేష్ ఎవరో మరో అమ్మాయితో కలిసి వస్తున్నాడు. వాళ్ళిద్దరూ అతిచనువుగా దగ్గర దగ్గరగా నడుస్తూ ఏవో కబుర్లు చెప్పుకుంటూ ముసి ముసిగా నవ్వుకుంటున్నారు. అసలు ఈలోకంలో వున్నట్లుగా లేరు.

విస్తుపోయింది మాలతి.

"ఎవరీ అమ్మాయి? ఎక్కడా చూసినట్లు లేదే. ఒకవేళ సురేష్‌వాళ్ళ చుట్టాలమ్మాయా?" ఆలోచిస్తోంది.

వాళ్ళిద్దరూ అలా నడుచుకుంటూ వస్తూండగా హాల్లో లైట్లారిపోయాయి.

ఆ చీకట్లో తడుముకుంటూ వచ్చి వాళ్ళు అలా తమ ముందరి సీట్లలో కూర్చోడం యాధృచ్ఛికం.

మాలతి ఒక్కక్షణం తటపటాయించింది.

ఇప్పుడతడిని పలకరించాలా? వద్దా? నిజానికి తనెప్పుడూ అతడితో చనువుగా మాట్లాడదు. అందునా యిప్పుడు పరిస్థితి తెలీకుండా అలా మాట్లాడించడం మంచిది కాదని మౌనంగా వుండి పోయింది.

ప్రవీణ్ అస్సలు వాళ్ళని గమనించినట్లేలేదు.

సినిమా మొదలైంది..దానితోపాటు మొదలయ్యాయి వాళ్ళిద్దరి పాట్లూనూ. ఆమె భుజం చుట్టూ చేయివేసి తనదగ్గరగా లాక్కున్నాడు సురేష్ - ఆమె చెవిలో ఏదో చెప్పి యిద్దరూపగలబడి నవ్వుకుంటున్నారు. మధ్య మధ్యన ఆమె బుగ్గని ముద్దాడుతున్నాడు. జుగుప్సాకరంగా వుంది మాలతికి.

ఇకపైన చూడలేక తమ్ముడి చేయి పట్టుకుని వడివడిగా మరో మూలకి వెళ్ళి కూర్చుంది. ఆ సీట్లో కూర్చున్న తర్వాతకూడా ఆమె గుండెలు వేగంగా దడదడగా కొట్టుకుంటూనే వున్నాయి.

"ఏమైందీ నీకూ..ఎందుకు అట్నుంచిటు లాక్కొచ్చావు" విసుగ్గా ప్రశ్నించి తిరిగి సినిమాలో లీనమైపోయాడు ప్రవీణ్...

మాలతి ఎప్పుడో సినిమా చూడ్డం మానేసింది.

ఆలోచనలు ఆమె మెదడును చెదపురుగుల్లా తొలిచేస్తున్నాయి.

సునంద కళ్లముందు నిలిచింది.."సునంద"- భర్త తన అదుపులోనే వుంటాడనీ..తనమాట జవదాటడనీ, తమది అన్యోన్య దాంపత్యమనీ ఎంతగానో నమ్మివున్న సునంద..మాలతికి ఆ టెక్నిక్ ఏదో తెలీదంటూ వదే వదే నిందించే సునంద.. నిద్రా దేవి కౌగిట్లో ఒదిగివున్న వేళ తన భర్త అరాత్రిని సద్వినియోగం చేసుకుంటున్నాడని తెలీని అమాయకురాలు సునంద...ప్చ్.



**ఈ ఊహ నిజమౌనా?**

ప్రపంచంలో అన్ని దేశాలలోనూ రాజకీయ రంగంలో మహిళలు ముందడుగు వేస్తున్నారు. అయితే అన్నివిధాలా ఎంతో ముందడుగు వేసిన అమెరికాలో మహిళలు రాజకీయంగా ముందడుగు వేయలేకపోతున్నారనిపిస్తుంది. ఇంతవరకూ దేశ అధ్యక్ష పదవి స్వీకరించిన మహిళ అమెరికాలో లేదు. అధ్యక్షుని సతీమణిగా 'ప్రథమ మహిళ' అనే గౌరవం మటుకు లభిస్తోంది. అయితే ఈసారి 'సెక్రటరీ ఆఫ్ స్టేట్' (విదేశాంగ మంత్రి) పదవి తప్పకుండా ఒక మహిళని వరిస్తుంది, అని అమెరికన్ పత్రికలు జోస్యం చెబుతున్నాయి.

ప్రపంచమంతా మోసపూరితంగా తోచసాగింది మాలతి కళ్ళకి.

గత సంవత్సరం "మేడ్‌ఫర్ ఈచదర్" కాంపిటీషన్లో సునందావాళ్ళకి మొదటి బహుమతి వచ్చిన సంగతి జ్ఞాపకానికొచ్చి మనసంతా కలతబారిందామెకి.

• • •

"ఏవిఁటమ్మా మాలతి అలా వున్నావు? రాత్రంతా నిద్రలేదు కదూ అలవాటు లేకుండా సెకండ్ షోకి వెళ్ళడమేమో కళ్ళు ఎర్రగా వున్నాయి. వెళ్ళి రెస్ట్ తీసుకో కూడదూ?" మందలింపుగా చెప్పింది రేవతీ దేవి.

"అదేం కాదత్తయ్యా"

"మరేమిటి అబ్బాయేమైనా అన్నాడా?"

"అబ్బెబ్బె అదేం కాదు" ఇంకా అక్కడే వుంటే అత్తగారు మరింతగా గుచ్చి గుచ్చి ప్రశ్నిస్తారేమోని వడివడిగా పడగ్గదిలోనికి వెళ్ళింది మాలతి.

ఆమె వెళ్ళిన వైపే అనుమానంగా చూస్తూ కుర్చీలో కూర్చుని పేపరు చూడసాగింది రేవతీదేవి.

ప్రక్కమీద వాలిందే గానీ మాలతికి నిద్రపట్టలేదు.

సునంద పదే పదే ఆమె జ్ఞాపకాల్లో నిలుస్తోంది.

"ఎంత నమ్మకం ఆమెకి భర్తంటే? ఇప్పుడు .... ఇప్పుడే తనేం చేయాలి?

సునందతో యింతగా స్నేహం చేస్తూ తాను చూసిన ఈ నిజాన్ని చెప్పడమా? చెప్పకపోవడమా?

చెప్పినట్లయితే భర్తని మనసారా నమ్మి సుఖంగా జీవించేస్తోన్న సునందని నరకయాతనికి గురిచేసిన దాన్నవుతాను.

చెప్పనట్లయితే స్నేహితురాలిగా సునందకి అన్యాయం చేసిన దాన్నవుతాను.

ఇలా ఆలోచిస్తూ తనలో తానే తర్జన భర్జన పడుతోన్న మాలతికి హఠాత్తుగా ఓ ఆలోచన వచ్చింది.

అత్తగారినడిగితేనో?

అవునుః అత్తగారు పేరున్న రచయిత్రి. ఆవిడ కథలూ, నవలలూ పాఠకులు అమితంగా ఇష్టపడుతారు. తాను ఆమె కోడలని చెప్పుకోవటానికి మాలతికి ఎంతో గర్వంగా వుంటుంది. ఎటువంటి సమస్యకైనా అద్భుతమైన పరిష్కారం చూపించగలదావిడ .... అదృష్టవంతురాలు. భర్తవైపు నుండి ఎటువంటి సమస్యలూ లేవు ఆవిడకి.

ఆ సాయంత్రం అత్తగారు ఒంటరిగా ఉన్నప్పుడు చూసి

"అత్తయ్యా ... నాకో చిన్న సలహా కావాలి"

"చెప్పమ్మా నావద్ద నీకు సంకోచమేమిటి?" నవ్వుతూ అడిగిందావిడ.

తాను క్రితం రాత్రి చూసినదంతా ఆమెకు కళ్ళకు కట్టినట్లుగా వివరించి "అత్తయ్యా ఇప్పుడు నేనేం చేయను? సునందకు చెప్పనా వద్దా?"

ఇంత చిన్న విషయాన్ని గురించి రాత్రంతా ఆలోచించి మథనపడుతున్న కోడలిని చూసి ఆత్మీయంగా నవ్విందామె.

"మాలతీ ఎవరో పరాయివాళ్ళని గురించి ఎందుకమ్మా నీకింత ఆలోచన?

"చెప్పండత్తయ్యా ప్లీజ్"

ఒక్క క్షణం ఆగి చెప్పిందావిడ.

"సత్యం బ్రూయాత్, సత్యం ప్రియం బ్రూయాత్ నబ్రూయాత్ సత్యమప్రియం"

"అంటే?"

"పిచ్చి తల్లీ ... సత్యాన్నే చెప్పాలి. నిజమే కానీ ఆ సత్యం ప్రియమైనదైతే ఫర్వాలేదు. సత్యమైనా సరే అప్రియమైనదైనప్పుడు చెప్పకపోవడమే మంచిదని దాని అర్థం"

"థాంక్యూ ... థాంక్యూ వెరీమచ్" అంటూ మాలతి సోఫాలో వెనక్కి వాలింది.

మాలతినే చూస్తూ

"సునంద భర్తని పిల్చి ఓసారి మందలించాలని" నిర్ణయించుకుంది రేవతీదేవి.

• • •

ఆ రాత్రి భర్త కోసం ఎదురు చూస్తూ బాల్కనీలోని చీకట్లో కూర్చుని అత్తగారి మాటలు నెమరు వేసుకుంటోంది మాలతి.

ఆ చీకటిరాత్రి అక్కడక్కడా చుక్కలు మిణుక్కు - మిణుక్కుమంటూ మాలతిని కవ్విస్తున్నాయి. ఆకాశం నీలంగా కాక నల్లగా తోస్తోంది మాలతికి.

ఇంతలో అవుట్ హవుస్ తలుపు తెరుచుకుంది

.... ఇంత రాత్రివేళ రంగి తలుపెందుకు తెరిచిందో? తలుపు తెరుచుకున్నంత మేరా లోపలి కాంతి బయటి నేలమీదకు ప్రాకింది. ఆ దీపపు కాంతిలో మిలమిలా మెరుస్తోన్న మొక్కల్ని చూస్తోన్న మాలతి ఉలిక్కిపడింది.

అవుట్ హావుస్ లోనుండి మామగారు వస్తున్నారు. ఆయన వెనుకే తలుపులు మూసుకున్నాయి. ఆ చీకట్లో మామగారు యింటివైపు వడివడిగా అడుగులు వేసుకుంటూ రావడం కన్పించింది మాలతికి.

ఒక్క క్షణం షాక్‌తో ఆమె గుండె కొట్టుకోవడం మానేసింది.

ప్రపంచం అంతటి మీదా ఒక్కసారిగా నమ్మకం ఆవిరైపోయిన క్షణమది. నిజాలు గొంతు కడ్డంపడి ఎంగిలి కూడా మింగుడు పడ్డం లేదు మాలతికి.

"నబ్రూయాత్ సత్యమప్రియం" అత్తగారు చెప్పిన వాక్యాలని, పదే పదే మననం చేసుకుంటోంది.

"అత్తయ్యా .. మీకీ విషయం" గుండె గొంతుకలో కొచ్చినట్లుగా అయిందామెకి.

ఎంత చిత్ర విచిత్రమైన వాళ్ళు మగాళ్ళు?

ప్రేమించినంత కాలమూ ప్రేమించి "అదేదో కౌమారప్రేమ .... మా పెళ్ళిలో ప్రాక్టికాలటీ వుండదూ" అంటూ వాదించే ప్రవీణ్, పెత్తనమంతా అమ్మకే అప్పజెప్పినా పెద్ద పెద్ద నిర్ణయాల విషయం వచ్చేసరికి ఆమెని నోరు విప్పనివ్వని నాన్నా..

రొటీన్ లైఫ్ నుండి రిలాక్సేషను కోసం రాత్రింబవళ్ళూ పేకాటలో మునిగి తేలుతూ జీవితాన్నే విస్మరించగల్గిన గోపి...

జీవితావసరాలన్నీ తీరుస్తూ, ఆదర్శవంతమైన భర్తగా నలుగురిలోనూ పేరు తెచ్చుకుని అర్ధరాత్రి భార్య ఆదమరచి నిద్రిస్తోన్న వేళ పరాయి ఆడదానిలో వెరయిటీ కోసం వెతుక్కునే సునంద భర్తా...

అత్తగారి ఆరోగ్యం గురించి అహర్నిశలూ ఆందోళన వ్యక్తం చేస్తూనే, ఆమె చేతి కాఫీ తప్ప త్రాగనంటూనే, అర్ధరాత్రి అవుట్ హావుస్‌లో పనిమనిషితో గడుపుతూ ఈ ప్రపంచం తనని చూడ్డం లేదని భ్రమించే మార్జాలం లాంటి మామగారూ

ప్రతిచోటా ఆడదానిది రెండో స్థానమే.

తన చేత్తో స్వయంగా సృష్టించిన స్త్రీ పురుషులిరువురికీ రెండు విడి విడి స్థానాలనెందుకేర్పరిచాడో భగవంతుడు.. ఆఁ ... అతగాడు మగాడు కావడం వల్ల కావొచ్చు.

మాలతికి ఆశ్చర్యం వేసింది.

"ఈ ప్రపంచంలో ఓ మనిషిని మరో మనిషి ఎందుకిలా మోసం చేయాలని చూస్తాడు"?

ఎవరో ఫక్కుమని నవ్వినట్లుగా అన్పించింది మాలతికి.


విస్తుపోయి చుట్టూ చూసింది. యెవరూ లేరు.

"ధర్మదేవత నాలుగు పాదాలూ నరికి వేయబడి కుప్ప కూలిపోయిన నేటి వర్తమానంలో, దాదాపుగా పూర్తిగా కుళ్ళిపోయిన వ్యవస్థ గురించి ... మనిషి మరో మనిషికి చేస్తూన్న అన్యాయాన్ని గురించి యింత స్వచ్ఛంగా ఆలోచిస్తూ, ప్రతీ చిన్న విషయానికీ ఆశ్చర్య పడిపోతున్న మాలతిని చూసి ఆమె మనసు ఫక్కున నవ్వింది ... మళ్ళీ నవ్వింది.... ఇంకా ఇంకా నవ్వుతోంది.

ఆలోచనల వేడికి మాలతి దహించుకుపోకుండా

కాంపౌండ్‌లోని చెట్లన్నీ ఆమె వైపు చల్లని పిల్ల వాయువులను ప్రసరింప జేస్తున్నాయి.

# స్త్రీ సేవా మందిర్ - నెహ్రూ రోజ్‌గార్ యోజన



స్త్రీ సేవా మందిర్ ఉపాధ్యక్షురాలు శ్రీమతి చెన్నమంటమ్మా కృష్ణారావు, మద్రాసు కార్పొరేషన్ కమిషనర్ శ్రీ అబుల్ హాసన్, కుట్టు మిషన్ అందుకుంటున్న శిక్షణ పొందిన వనిత.

స్త్రీ సేవా మందిర్ గత 42 సంవత్సరాలుగా, వివిధ రంగాలలో స్త్రీలకు శిక్షణ ఇచ్చి, వారి, వారి అర్హతలకు తగినట్లుగా జీవనోపాధి కల్పిస్తున్నది.

మందిర్ యొక్క అనేక విభాగాలలో నందినీ ఐ.టి.ఐ (ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్) ఒకటి. 1988లో మద్రాసు రోటరీ క్లబ్ (South West) వారు 8 కుట్టు మిషనులను, యువతులు కుట్టు నేర్చుకునే నిమిత్తం యిచ్చారు. అప్పటి నుండి, ప్రత్యేకించి స్వయం జీవనోపాధి కోరి వచ్చువారికి, ఈ కుట్టు మిషన్‌లు చాలా ఉపయోగకరంగా వున్నాయి. ఇంత వరకూ 50 మంది శిక్షణ పొందారు. మందిర్ సేవలను గుర్తించి మద్రాసు కార్పొరేషన్ వారు నెహ్రూ రోజ్‌గార్ యోజన ద్వారా టైలరింగ్, స్క్రీన్ ప్రింటింగ్ వృత్తులలో శిక్షణ యిచ్చి, స్త్రీలను స్వయం సంపాదనాపరులుగా తీర్చిదిద్దమని 1989లో కోరారు.

ఆ సందర్భంగా స్త్రీ సేవా మందిర్ వారు ఆగస్టు 1వ తేదీ 1990 నుండి 31 జనవరి 1991 వరకూ శిక్షణా తరగతులను నిర్వహించారు.ఈ పథకంలో టైలరింగ్‌లో 25 మంది, స్క్రీన్ ప్రింటింగ్‌లో 25 మంది తీసుకోబడ్డారు. 18 సం॥ నుండి 35 సం॥ వయస్సు గలిగి, 8వ తరగతి నుండి 10వ తరగతి దాకా చదివి, మద్రాసు సాలిగ్రామం ప్రాంతంలో, కార్పొరేషన్ పరిధిలో వుండే వారిని ఎన్నుకున్నారు.

ఈ ఆరు నెలల శిక్షణా కాలంలో ఒక్కొక్క స్త్రీకి రూ॥ 100/- విద్యార్థి వేతనం, కుట్టుకు కావల్సిన సామగ్రికి రూ॥ 50/- చొప్పున కార్పొరేషన్ వారు యిచ్చారు. ఇందులో ముఖ్యంగా గమనించవల్సిన విషయం ఏమిటంటే శిక్షణ పొందు వారి పేరు రేషన్ కార్డులో తప్పక వుండాలి. ఆరు మాసముల శిక్షణ ముగించిన వారికి కార్పొరేషన్ వారు కుట్టు మిషన్ రూపంలో బ్యాంకు ద్వారా ఋణం యిప్పించి సహాయ పడ్డారు. అదే విధంగా స్క్రీన్ ప్రింటింగ్‌కు కావల్సిన పరికరాలు బ్యాంకు ద్వారా ఇప్పించి, సహాయ పడ్డారు.

శిక్షణ ముగిసిన తర్వాత కార్పొరేషన్ కమీషనర్ శ్రీ అబుల్ హాసన్, సర్టిఫికెట్లు యిచ్చారు. ఆయన ఆ సందర్భంలో నెహ్రూ రోజ్‌గార్ యోజనా గురించి దాని విశేషాల గురించి తెలియజెప్పారు. ఆనాటి ఫంక్షన్‌లో కార్పొరేషన్ అధికారులు పాల్గొని ఋణం తీసుకునే పద్ధతులు, తిరిగి యిచ్చే పద్ధతులు వివరించారు. స్క్రీన్ ప్రింటింగ్‌లో శిక్షణ పొందిన వారిలో ఎనిమిది మంది సొంతంగా స్క్రీన్ ప్రింటింగ్ ప్రారంభించారు. మిగిలిన వారు యితర స్క్రీన్ ప్రింటింగ్ యూనిట్స్‌లో ఉద్యోగంలో చేరారు. అలాగే టైలరింగ్‌లో ట్రైనింగ్ అయినవారు పది మంది దాకా టైలరింగ్ ఉద్యోగాలలో చేరారు. మిగిలిన వారు ఉపాధిగా వాళ్ళ యిళ్ళలో సొంతంగా కుట్టు పని చేసుకుంటున్నారు. □